క్లుప్తంగా

ఉన్న చోటనే పట్టాలు ఇవ్వాలి

తాడేపల్లిరూరల్: తాడేపల్లి పట్టణ పరిధిలోని నులకపేట ఫారెస్ట్ ప్రాంతంలో నివాసముంటున్న తమకు నివాసం ఉన్నచోటనే స్థలాలకు పట్టాలు ఇవ్వాలని గురువారం సీపీఎం పట్టణ కార్యదర్శి బూరగ వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో డిమాండ్ చేస్తూ నిరసన వ్యక్తం చేశారు. ఆయన మాట్లాడుతూ నులకపేట ఫారెస్ట్ ప్రాంతంలో సుమారు 2 వేల మంది నివాసాలు ఏర్పాటు చేసుకుని జీవిస్తున్నారని, ఫారెస్ట్ ప్రాంత వాసులకు రాజధాని వివిధ గ్రామాల్లో ఆర్–5 జోన్‌లో సెంటు స్థలం కేటాయించారని, అంత దూరం వెళితే ఉపాధి పోతుందని, ఉన్న చోటనే ఫారెస్ట్ ప్రాంతాన్ని డీ ఫారెస్ట్ చేసి పట్టాలు మంజూరు చేయాలని కోరుతున్నారని అన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు వేముల దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ విద్యావిధానంపై అవగాహన

తాడేపల్లిరూరల్: దుగ్గిరాలలోని డాక్టర్ కొత్త రఘురామయ్య మెమోరియల్ డిగ్రీ కళాశాలలో ఎన్ఈపీ 2020 (జాతీయ విద్యావిధానం 2020)పై గురువారం విద్యార్థులకు, తల్లిదండ్రులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపల్ కె.గిరిధరరావు మాట్లాడుతూ జాతీయ విద్యావిధానం 2020 సంస్కరణల్లో భాగంగా 4 సంవత్సరాల ఆనర్స్ డిగ్రీ గురించి వివరించారు. సింగిల్ సబ్జెక్టు మాత్రమే ప్రధానంగా తీసుకుని మిగిలిన సబ్జెక్టులలో నిర్దిష్ట సంఖ్యలో మార్కులు పొందాల్సి ఉంటుందని వివరించారు. సబ్జెక్టుల ఎంపికలో విద్యార్థులకు పూర్తి స్వేచ్ఛ ఉంటుందని, 4 సంవత్సరాల ఆనర్స్ డిగ్రీ తర్వాత ఏడాది పీజీ ఉంటుందని, లేదా పీహెచ్‌డీలో నేరుగా చేరవచ్చని తెలిపారు. ఏడాది సర్టిఫికెట్, 2 సంవత్సరాల డిప్లొమో, 3 సంవత్సరాల తర్వాత డిగ్రీ ఇవ్వబడతాయని తెలిపారు. విద్యార్థులు ఏదైనా కారణం వల్ల మధ్యలో విద్యాభ్యాసం ఆపివేసినా తిరిగి మరలా కొనసాగించవచ్చని వివరించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ టి.రాఘవరెడ్డి, కె. సరళాదేవి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ బి.రాంబాబు, విద్యార్థిని, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ముస్లిం మైనార్టీలపై పవన్ కల్యాణ్‌ది కపట ప్రేమ

తాడేపల్లిరూరల్: జనసేన పార్టీ అధినేత పవన్ కల్యాణ్ ఎన్నికలు దగ్గర పడడంతో ఓట్ల కోసం ముస్లిం మైనార్టీలపై కపట ప్రేమ ప్రదర్శిస్తున్నారని వైఎస్సార్ సీపీ మైనార్టీ విభాగం జిల్లా ప్రధానకార్యదర్శి షేక్ సుభాని అన్నారు. గురువారం దుగ్గిరాల ముర్తుజానగర్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మతతత్వ బీజేపీతో ప్రయాణం సాగిస్తున్న పవన్ ముస్లింలకు అండగా ఉంటానని కాకినాడలో ముస్లిం ప్రతినిధులతో చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముస్లింలను డెప్యూటీ సీఎం చేయడంతోపాటు అనేక నామినేటెడ్ పోస్టుల్లోనూ ముస్లింలకు రాజకీయ ప్రాధాన్యత కల్పించి, ముస్లింల అభివృద్ధికి, సంక్షేమానికి విశేష కృషి చేస్తున్నారని అన్నారు. సమావేశంలో మైనార్టీ నాయకులు షేక్ రషీద్, షేక్ జాన్ సైదా, షేక్ హుస్సేన్, పఠాన్ మస్తాన్‌వలి తదితరులు పాల్గొన్నారు.

25న ఉచిత మెగా వైద్యశిబిరం

తాడేపల్లిరూరల్: తాడేపల్లి పట్టణ పరిధిలోని మహానాడులో ఈనెల 25వ తేదీ ఉచిత మెగా వైద్యశిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు మానవ సేవా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు వంగర సురేష్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వైద్య శిబిరం తాడేపల్లి పట్టణ పరిధిలోని మహానాడు 16వ రోడ్డులో ఉదయం ఎనిమిది నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నిర్వహిస్తున్నామని తెలిపారు. షుగర్, బీపీ, ఎకో, హిమోగ్లోబిన్, థైరాయిడ్, హార్మోన్, ఈసీజీ పరీక్షలు, వైద్యుల పర్యవేక్షణలో ఉచితంగా నిర్వహిస్తామని, ఈ అవకాశాన్ని పరిసర ప్రాంత ప్రజలు వినియోగించుకోవాలని కోరారు.

ప్రైవేటు ఫైనాన్షియర్ల దౌర్జన్యం

తాడేపల్లిరూరల్: రోజురోజుకూ ప్రైవేట్ ఫైనాన్షియర్ల దౌర్జన్యాలు పెరిగిపోతున్నాయి. తాజాగా గురువారం పాత జాతీయ రహదారి వెంబడి ఉండవల్లిలోని అద్దేపల్లి వారి వీధిలో నివాసం ఉంటున్న మట్టిపాటి వలిబాబుపై ఫైనాన్స్ కంపెనీ ప్రతినిధులు దాడి చేశారు. అనంతరం వలిబాబుపై స్థానిక పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దాడి చేసిన వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని బాధితుడు కోరుతున్నాడు.

టిష్యు కల్చర్ అరటి సాగుకు ప్రోత్సాహం

మంగళగిరి: నగర పాలక సంస్థ పరిధిలోని నూతక్కిలో గురువారం రైతులకు టిష్యు కల్చర్ అరటి సాగుపై శిక్షణా కార్యక్రమం నిర్వహించి అవగాహన కల్పించారు. జిల్లా ఉద్యానశాఖ అధికారి రవీంద్రబాబు మాట్లాడుతూ ఉద్యాన శాఖ టిష్యూ కల్చర్ అరటి మొక్కల సాగు ప్రోత్సహిస్తూ 2.5 ఎకరాలకు రూ.30వేల సబ్సిడీని అందజేస్తుందన్నారు. రైతులు సంఘాలుగా ఏర్పడి కలెక్షన్ సెంటర్లు, కోల్డ్ రూమ్‌లు నిర్మించుకుని ఉపయోగించుకోవాలని సూచించారు. సల్ఫర్ మిల్స్ లిమిటెడ్ జనరల్ మేనేజర్ రాజశేఖరరెడ్డి సల్ఫర్, జింక్ పోషకాలు అవసరం గురించి, నేలలో సమతుల్యం, ఈ ఆర్గానిక్ ఉత్పత్తుల వినియోగం గురించి క్షుణ్ణంగా రైతులకు వివరించారు. కార్యక్రమంలో మండల ఉద్యాన శాఖ అధికారి దీపిక, నూతక్కి ఉద్యాన సహాయకులు రాజేశ్వరి, ప్రశాంత్, దివాకర్‌లతో పాటు పలువురు రైతులు పాల్గొన్నారు.

రోల్ మోడల్‌గా తీర్చిదిద్దడమే లక్ష్యం

- రానున్న 20 రోజుల్లో వైఎస్సార్ చేనేత సముదాయం ప్రారంభం
- అర్హులైన ప్రతి ఒక్క చేనేత కార్మికునికి వైఎస్సార్ నేతన్న నేస్తం
- ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే)



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే), వేదికపై ఎమ్మెల్సీ మురుగుడు తదితరులు

మంగళగిరి: రాష్ట్రంలోనే రోల్ మోడల్‌గా మంగళగిరిని తీర్చిదిద్దడమే లక్ష్యమని, రానున్న 20 రోజుల్లో నగరంలో వైఎస్సార్ చేనేత సముదాయాన్ని ప్రారంభించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే) చెప్పారు. గురువారం నగరంలోని తన కార్యాలయంలో ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావుతో కలసి రాజీవ్ గృహకల్పలో నివాసం ఉంటున్న చేనేత కార్మికులతో సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే ఆర్కే మాట్లాడుతూ మంగళగిరి అంటేనే చేనేతకు పెట్టింది పేరు అని, అటువంటి నగరంలో చేనేత కార్మికులకు మెరుగైన ఉపాధి కల్పించాలనే సదుద్దేశంతో దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో రాజీవ్ గృహకల్ప నిర్మాణం చేపట్టడంతోపాటు చేనేత మగ్గాల షెడ్లను నిర్మించాలని నిర్ణయించిన విషయం మనందరికీ తెలిసిందేనన్నారు. చేనేత కార్మికులు రాజీవ్ గృహకల్ప భవన సముదాయంలో నివసిస్తూ పక్కనే ఉన్న ఖాళీ స్థలాల్లో చేనేత మగ్గాలు ఏర్పాటు చేస్తే అక్కడే పని చేసుకుని తిరిగి వారి వారి ఇళ్లకు వచ్చేందుకు సౌలభ్యంగా ఉంటుందని దివంగత ముఖ్యమంత్రి రాజశేఖరరెడ్డి భావించారని, అయితే దురదృష్టవశాత్తూ ఆయన మరణానంతరం చేనేత మగ్గాల షెడ్ల నిర్మాణం నిలిచిపోయిందన్నారు. ఈ నేపథ్యంలో ఆయన తనయుడు, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో చేనేత కార్మికులకు మెరుగైన ఉపాధి కల్పనే ధ్యేయంగా రాజీవ్ గృహకల్ప సముదాయంలో చేనేత మగ్గాల షెడ్లను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. కేంద్ర ప్రభుత్వం రూ.1.20 కోట్లు, రాష్ట్ర ప్రభుత్వం రూ.2 కోట్లు మొత్తం కలిపి రూ.3.20 కోట్లతో 146 మగ్గాల షెడ్లను నిర్మించడం జరిగిందన్నారు. ఇందులో కొన్ని గుంట మగ్గాలు కాగా మరికొన్ని హ్యాండ్ మగ్గాలు కూడా ఉన్నాయని చెప్పారు. రానున్న 20 రోజుల్లో చేనేత మగ్గాలను ప్రారంభించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. హ్యాండ్‌లూమ్ కమిషనర్‌ను కలసి విధివిధానాలు రూపొందించి వీలైనంత త్వరితగతిన చేనేత కార్మికులను సొంత మగ్గాలపై చేర్చడం జరుగుతుందన్నారు. అద్దె ఇళ్లల్లో నివాసం ఉంటూ మగ్గాల షెడ్లు ఏర్పాటు చేసుకోలేకపోవడంతోపాటు మరే ఇతర కారణాల వల్ల వైఎస్సార్ నేతన్న నేస్తం పథకం నిలిచిపోయిన వారికి తిరిగి పొందేందుకు అవకాశం ఉందని, ఎవరూ ఆందోళన చెందాల్సిన పని లేదన్నారు. నేతన్నలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే రాయితీలను పూర్తిగా అందజేయడం జరుగుతుందన్నారు. సమావేశంలో జిల్లా వైఎస్సార్ సీపీ చేనేత విభాగం అధ్యక్షుడు మునగాల మల్లేశ్వరరావు, హ్యాండ్‌లూమ్ ఏడీ వనజలతోపాటు పలువురు చేనేత కార్మికులు పాల్గొన్నారు.

బూత్ లెవల్ అధికారులకు శిక్షణ



శిక్షణ ఇస్తున్న నియోజకవర్గ ప్రత్యేకాధికారి ఎం. వెంకట్రామిరెడ్డి

ఫిరంగిపురం: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో గురువారం మండలంలోని పలు గ్రామాల బూత్ లెవల్ అధికారులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. నియోజకవర్గ ప్రత్యేకాధికారి ఎం. వెంకట్రామిరెడ్డి మాట్లాడుతూ ఎన్నికల సంఘం రూపొందించిన జాబితా ప్రకారం బూత్ లెవల్ అధికారులు గ్రామాల్లో ఇంటింటికి తిరిగి ఓట్లు లేని వారిని గుర్తించాలని చెప్పారు. గుర్తించిన వారిచే ఓటు కోసం అప్లికేషన్లు పెట్టించాలన్నారు. ఇంటిడోరు నంబర్లు సరిగా ఉన్నదీ, లేనిదీ గమనించాలని చెప్పారు. పేర్లు తప్పు ఉన్నట్లయితే వాటిని గుర్తించి సరిచేసే విధంగా చూడాలన్నారు. ఒకే డోర్ నెంబర్‌పై ఓట్లు ఉన్న వాటిని గుర్తించాలని చెప్పారు. వందేళ్లు దాటిన ఓటర్లు ఉంటే వారిని గుర్తించి తెలియజేయాలన్నారు. 2024 జనవరికి తుది జాబితా సిద్ధం చేయాలని చెప్పారు. కార్యక్రమంలో తహసీల్దార్ పద్మనాభుడు, కార్యాలయం సిబ్బంది, బూత్ లెవల్ అధికారులు పాల్గొన్నారు.

ఫోర్టిఫైడ్ బియ్యంతో మెరుగైన ఆరోగ్యం



పోస్టర్ విడుదల చేస్తున్న డీటీ కాకుమాను ప్రసాద్, సీఎస్ ఆర్ఐ కోటేశ్వరరావు

తాడికొండ: ప్రభుత్వం రేషన్ దుకాణాల ద్వారా అందించే ఫోర్టిఫైడ్ బియ్యంతో మెరుగైన ఆరోగ్యం, అనేక ప్రయోజనాలు ఉన్నాయని డెప్యూటీ తహసీల్దార్ కాకుమాను ప్రసాద్ అన్నారు. అందరికీ మెరుగైన ఆరోగ్యం కోసం బలవర్థక (ఫోర్టిఫైడ్) బియ్యం ప్రయోజనాలను తెలియజేసే ప్రక్రియలో భాగంగా తాడికొండలో సివిల్ సప్లయీస్ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన పోస్టర్ విడుదల కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఆయన మాట్లాడుతూ ఫోర్టిఫైడ్ బియ్యం, సాధారణ బియ్యం ఒకేలా ఉంటాయని, వండటం కూడా ఒకేలా వండి గంజి వార్చకుండా ఉడికించడం ద్వారా బహుళ ప్రయోజనాలు కలుగుతాయన్నారు. సివిల్ సప్లయీస్ ఆర్ఐ కోటేశ్వరరావు మాట్లాడుతూ రేషన్ బియ్యంపై అపోహలు వీడి పోషకాహార లోపం అధిగమించి బలవర్థకమైన ఆహారం అందించేందుకు ఏపీ ప్రభుత్వం అందిస్తున్న ఫోర్టిఫైడ్ బియ్యాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం, చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వీఆర్వో శర్మ, షేక్ సైదా పలువురు సివిల్ సప్లయీస్ సిబ్బంది పాల్గొన్నారు.

పట్టాదారులలో ఆనందోత్సాహం



బ్రహ్మానందపురంలో ఇళ్ల పట్టాలు అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు దర్శి రమేష్

తాడేపల్లిరూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశీస్సులతో, ఎమ్మెల్యే ఆర్కే చొరవతో తాడేపల్లిలోని లబ్ధిదారులకు సీఆర్‌డీఏ పరిధిలోని వివిధ ప్రాంతాల్లో ఇళ్ల పట్టాలు అందజేశారు. సాంకేతిక లోపం కారణంగా కొంతమందికి అందకపోవడంతో గురువారం బ్రహ్మానందపురంలోని లబ్ధిదారులకు సచివాలయ అడ్మిన్ పవిత్ర, వైఎస్సార్‌సీపీ నాయకులు దర్శి రమేష్ ఆధ్వర్యంలో పట్టాల పంపిణీ నిర్వహించారు. రమేష్ మాట్లాడుతూ కుల, మత, రాజకీయాలు చూడకుండా ప్రతి ఒక్కరికీ ఇళ్ల పట్టాలు ఇచ్చిన ఘనత తమ ప్రభుత్వానకే దక్కిందని అన్నారు. కార్యక్రమంలో సచివాలయ కన్వీనర్లు, యాకోబు, హేమ, గుణసాగర్ తదిరతులు పాల్గొన్నారు.

అద్దె ఇంట్లోనే ఉంటున్నాం



మా పెళ్లయిన దగ్గర నుంచి అద్దె ఇంట్లోనే ఉంటున్నాం. సొంత ఇంటి స్థలం కోసం ఎన్నోసార్లు దరఖాస్తు చేసుకున్నాం. జగనన్న ప్రభుత్వంలో మాకు ఇళ్లస్థలం వచ్చింది. త్వరలోనే ప్రభుత్వం అందించే సహకారంతో ఇంటిని నిర్మించుకుని ఆ ఇంట్లో నివాసముంటాం.

పిల్లి షారోను

భరోసా లభించింది



బ్రహ్మానందపురంలో ఫారెస్ట్ భూమిలో చిన్న ఇల్లు వేసుకుని నివాసముంటున్నాం. సంవత్సరానికి రెండు మూడుసార్లు ఫారెస్ట్ అధికారులు వచ్చి ఇళ్ల తీసివేయాలని భయపెడుతున్నారు. ఇక జగనన్న ఇచ్చిన స్థలంలో మాకు ఎలాంటి భయం ఉండదు. మాకు ఒక భరోసా లభించింది. ఇంటి స్థలం ఇస్తే ఇల్లు ఖాళీ చేయిస్తారని ప్రచారం చేస్తున్నారు. ఇల్లు పూర్తయినదాకా ఖాళీచేయించమని నాయకులు హామీ ఇచ్చారు.

బుస్సా ప్రసన్న

కంతేరులో ఇరువర్గాల దాడి



కంతేరు(తాడికొండ): మండల పరిధిలోని కంతేరు గ్రామంలో ఇరువర్గాలకు చెందిన యువకులు పరస్పరం దాడులు చేసుకున్నారు. పలువురికి తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మామిడితోట వద్ద ఇరువర్గాలకు చెందిన యువకుల మధ్య వాగ్వివాదం జరిగింది. మాట మాట పెరిగి దాడులకు దిగారు. ఎస్సీ కాలనీకి చెందిన యువకులకు తలలు పగిలి తీవ్రగాయాలయ్యాయి. గాయాలైన యువకులను జీజీహెచ్‌కు తరలించి చికిత్స అందిస్తున్నారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ జి.శ్రీనివాసరావు తెలిపారు.

తహసీల్దార్ శ్రీనివాసశర్మ బాధ్యతల స్వీకారం



మేడికొండూరు: తహసీల్దార్‌గా శ్రీనివాసశర్మ గురువారం బాధ్యతలు చేపట్టారు. పల్నాడు జిల్లా గురజాల తహసీల్దార్‌గా పనిచేస్తూ సాధారణ బదిలీల్లో భాగంగా మేడికొండూరు వచ్చారు. శ్రీనివాసశర్మ మాట్లాడుతూ ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజల సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. మండలంలో ప్రజలు దరఖాస్తులు అర్జీలను త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.

ట్రక్ ఆపరేటర్ నియామకానికి దరఖాస్తుల ఆహ్వానం

నెహ్రూనగర్: ఇంటింటికీ రేషన్ సరుకులు సరఫరా చేయడానికి గానూ ట్రక్ ఆపరేటర్ నియామకానికి ముస్లిం మైనారిటీ (బీసీ–ఈ) అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు నగర కమిషనర్ కీర్తి చేకూరి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు 1 జూన్ 2023 నాటికి 21–45 ఏళ్లలోపు ఉండి, 7వ తరగతి పాసై ఉండాలని సూచించారు. డ్రైవింగ్ లైసెన్స్ జారీ చేసిన తేదీ నుంచి రెండేళ్ల పైబడి అనుభవం కలిగి ఉండాలన్నారు. ఈ నెల 24 నుంచి 27 వరకు గుంటూరు నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని ఉపా సెల్ విభాగంలో దరఖాస్తు అందజేసి రశీదు పొందాలని ఆమె సూచించారు.

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన అవసరం

పట్నంబజారు: ట్రాఫిక్ నిబంధనలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ట్రాఫిక్ డీఎస్పీ ఎం.బాలసుందరరావు చెప్పారు. పాత గుంటూరులోని యాదవ హైస్కూలులో గురువారం ట్రాఫిక్ నిబంధనలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ట్రాఫిక్ నిబంధనలకు సంబంధించిన పోస్టర్లు ఆవిష్కరించారు. డీఎస్పీ మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే ప్రతి ఒక్కరూ ట్రాఫిక్‌పై అవగాహన కలిగి ఉండటం వల్ల ప్రమాదాల్ని అరికట్టవచ్చని తెలిపారు. ఆటోలు, బస్సుల్లో ప్రయాణించే సమయంలో జాగ్రత్తలు పాటించాలని సూచించారు. అనంతరం వీడియో చిత్రాల ద్వారా ట్రాఫిక్‌పై అవగాహన కల్పించారు.

ఉత్సాహంగా కొనసాగిన మొక్కలు నాటే కార్యక్రమం



మొక్కలు నాటుతున్న మేడికొండూరు జెడ్పీటీసీ కందుల సిద్దయ్య, ఇంటెల్ పాఠశాల విద్యార్థులు

మేడికొండూరు: మండల పరిధిలోని పేరేచర్ల ఇంటెల్ హైస్కూల్ విద్యార్థులు గురువారం మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. పేరేచర్ల గ్రామ శివారులోని నగరవనం, కొండచరియపై కార్యక్రమాన్ని కొనసాగించారు. పాఠశాల డైరెక్టర్ కోనూరి జయకుమార్ మాట్లాడుతూ చదువుతోపాటు ఇలాంటి కార్యక్రమాలు చేపట్టడం వల్ల మానవాళికి దోహదపడుతోందన్నారు. విద్యార్థులు చేపట్టిన కార్యక్రమానికి జెడ్పీటీసీ కందుల సిద్ధయ్య పాల్గొని మొక్కలు నాటారు. ఆయన మాట్లాడుతూ మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడుకోవాలన్నారు. ఇంటెల్ పాఠశాల యాజమాన్యానికి అభినందనలు తెలిపారు. పాఠశాల నుంచి తెచ్చిన మొక్కలు నాటారు. కార్యక్రమంలో 300 మంది విద్యార్థులు పాల్గొన్నారు. 20వేల సీడ్స్‌ను నాటడం జరిగిందన్నారు. కార్యక్రమంలో పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు రస్ హుస్సేన్, అధ్యాపక సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎస్సీ కమ్యూనిటీ హాలు పనులు ప్రారంభం



ఎస్సీ కమ్యూనిటీ హాల్ పనులు జరుగుతున్న దృశ్యం

తాడేపల్లిరూరల్: దుగ్గిరాల మండలం పెనుమూలి గ్రామంలో ఎస్సీ కమ్యూనిటీ హాల్ పెండింగ్ పనులు గురువారం ప్రారంభమయ్యాయి. పెనుమూలి ఎంపీటీసీ సభ్యుడు షేక్ సల్మా మాట్లాడుతూ పెనుమూలిలో ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే) పర్యటించినపుడు స్థానికులు ఎస్సీ కమ్యూనిటీ హాల్ నిర్మాణం పెండింగ్‌లో ఉందన్న విషయాన్ని ఆయన దృష్టికి తీసుకువెళ్లారని, పెండింగ్‌లో ఉన్న భవనాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే ఆర్కే తన సొంత నిధులతో నిర్మాణ పనులను పూర్తిచేస్తానని హామీ ఇచ్చారని తెలిపారు. ఇచ్చిన మాట ప్రకారం 24 గంటల్లో పనులను ప్రారంభించారని అన్నారు. ఇచ్చిన మాట నిలబెట్టుకున్న ఎమ్మెల్యే ఆర్కేకు స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వార్డు మెంబర్ బెజవాడ నాగరాజు, ఎంపీటీసీ మాజీ సభ్యుడు బన్నా రావూరి రాంబాబు, వైఎస్సార్ సీపీ నాయకులు అబ్దుల్ నజీర్ తదితరులు పాల్గొన్నారు.

హామీలు నూరుశాతం అమలుచేసిన ఘనత సీఎం జగన్‌దే

- వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త కత్తెర సురేష్‌కుమార్
- లాంలో గడప గడపకు మన ప్రభుత్వం



లాం గ్రామంలో ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న కత్తెర సురేష్‌కుమార్

లాం(తాడికొండ): అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా ఇచ్చిన మాటకు కట్టుబడి నూరుశాతం హామీలు అమలు చేస్తున్న ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదేనని వైఎస్సార్‌సీపీ తాడికొండ నియోజకవర్గ సమన్వయకర్త కత్తెర సురేష్‌కుమార్ అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా గురువారం లాం గ్రామంలో ఇంటింటికి తిరిగి సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేదా అని ఆరా తీశారు. స్థానిక సమస్యలు అడిగి తెలుసుకొని సత్వరమే పరిష్కరించాలని అధికారులకు సూచించారు. ఆయన మాట్లాడుతూ 14 సంవత్సరాలు ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబు పేదలను కనీసం పట్టించుకోకుండా కేవలం కార్పొరేట్ వ్యవస్థకు కొమ్ముకాసి కోట్ల రూపాయలు దోచుకున్నాడని, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమం అందిస్తుంటే గుండెలు బాదుకోవడం ఎందుకని మండిపడ్డారు. బాబు హయాంలో ఎంతమంది పేదలకు మేలు చేశాడో శ్వేతపత్రం విడుదల చేసే దమ్ముందా ఉందా అని ప్రశ్నించారు. ఎన్నికల సమయంలో పేదల కాళ్లు పట్టుకోవడం, ఎన్నికల అనంతరం వారి జుట్టుపట్టుకొని బయటకు నెట్టడం బాబు ఆయన ఎల్లో మీడియాకు అలవాటే అని, నిన్న మొన్నటి వరకు పేదలకు ఇళ్ల స్థలాలు సైతం వద్దంటూ కోర్టుల్లో కేసులు వేసిన బాబు అండ్ కో ఇప్పుడు పేదల జపం అందుకోవడం సిగ్గుచేటన్నారు. పార్టీ సింబలే లేని పవన్ కళ్యాణ్ ముఖ్యమంత్రిని తానే అని కాసేపు, అవుతానో లేదో అని కాసేపు అనడం కామెడీ సినిమాను తలపిస్తుందన్నారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ డైరెక్టర్ దాసరి రాజు, ఎంపీటీసీ రావూరి దివ్య, షేక్ నూర్జహాన్, కొండా శ్రీనివాసరెడ్డి, ఇమ్మానుయేలు, మైనార్టీ నాయకులు షేక్ సలీమ్, మీర్జావలీ, సాధిక్, గోల్డ్ బాబు రాయపూడి రంగారావు, కొల్లికొండ వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సచివాలయాల్లో సత్వర సేవలు అందించాలి

కోయవారిపాలెం(ప్రత్తిపాడు): సచివాలయాల్లో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఎంపీడీవో ఏ.శ్రీరమ్య తెలిపారు. మండల పరిధిలోని కోయవారిపాలెం గ్రామ సచివాలయాన్ని గురువారం మధ్యాహ్నం ఆమె తనిఖీ చేశారు. ఉద్యోగుల హాజరు పట్టికలతో పాటు రికార్డులు పరిశీలించారు. ఎంపీడీవో మాట్లాడుతూ పదేపదే ప్రజల్ని సచివాలయాల చుట్టూ తిప్పుకోకుండా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని చెప్పారు. త్వరలో రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా జగనన్న సురక్ష కార్యక్రమాన్ని సచివాలయాల వారీగా అమలు చేయనున్నదని చెప్పారు.

బాధితులకు ఎమ్మెల్యే ఆర్థిక సాయం

మంగళగిరి: అనారోగ్యంతో బాధపడుతున్న నలుగురు వృద్ధులకు ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే) రూ.20వేల ఆర్థికసాయం అందజేశారు. నగరంలోని రత్నాల చెరువుకు చెందిన కె ముత్తమ్మ, ఎం.ప్రకాశరావు, షేక్ జానీ, మెహరూన్ బీలకు ఒక్కొక్కరికి రూ.5వేలు చొప్పున రూ.20వేలను స్థానిక పార్టీ నాయకుల చేతుల మీదుగా గురువారం అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా చేనేత విభాగం అధ్యక్షుడు మునగాల మల్లేశ్వరరావు, అనుబంధ సంఘాల నాయకులు ఆకురాతి రాజేష్, ఎండీ ఫిరోజ్, మహిళా నాయకురాలు మల్లవరపు సుధారాణి తదితరులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి సాయం

తాడేపల్లిరూరల్: దుగ్గిరాల మండలం రేవేంద్రపాడు గ్రామానికి చెందిన షేక్ సైదా, రేష్మా దంపతుల కుమార్తె రుక్సానా(6) అనారోగ్యంతో మృతి చెందగా ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే) రూ.20వేల ఆర్థిక సహాయాన్ని ప్రకటించారు. ఆ మొత్తాన్ని రేవేంద్రపాడు సర్పంచ్ పలుకూరి మేరమ్మ గురువారం బాధిత కుటుంబాన్ని పరామర్శించి ఆర్థిక సహాయాన్ని అందజేశారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ మధు నాగదుర్గ, మోరంపూడి సర్పంచ్ ఇత్తడి రమేష్ పాల్గొన్నారు.

తాడేపల్లిరూరల్: దుగ్గిరాల గ్రామానికి చెందిన కొక్కిలిగడ్డ విక్టోరియా, శివప్రసాద్‌లకు ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే) తోపుడు బండ్లు అందించారు. గురువారం దుగ్గిరాల ఎంపీపీ దానబోయిన సంతోషరూపవాణి, జెడ్పీటీసీ సభ్యురాలు మేకతోటి అరుణలు బాధితులకు వాటిని అందజేశారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బానావత్ కుషీబాయి పాల్గొన్నారు.

తాడేపల్లిరూరల్: దుగ్గిరాల మండలం మంచికలపూడి గ్రామానికి చెందిన అద్దేపల్లి నీలాంబరం కుటుంబానికి రూ.20 వేలు, చలపాటి సురేష్‌కు రూ.10వేలు ఆర్థిక సాయం ఎమ్మెల్యే ఆర్కే ప్రకటించారు. ఈ మొత్తాన్ని జెడ్పీటీసీ సభ్యురాలు ఎం.అరుణ, ఎంపీపీ డి.సంతోషరూపవాణి గురువారం బాధితులకు అందజేశారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ యార్లగడ్డ శ్రీచంద్ర దుర్గాభవాని పాల్గొన్నారు.

మంగళగిరి: నగరానికి చెందిన చిరువ్యాపారులు అన్వర్, శ్రీను, పెరుమాళ్ల లక్ష్మి, బిట్ర పద్మ, ఎస్‌కే అహ్మద్ బేగ్, ఎస్‌కే ఫహీమ్‌లకు గురువారం నగరంలోని ఎమ్మెల్యే ఆర్కే కార్యాలయం వద్ద వైఎస్సార్ సీపీ నాయకులు తోపుడు బండ్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డు చైర్‌పర్సన్ మునగాల భాగ్యలక్ష్మి, వైఎస్సార్ సీపీ జిల్లా చేనేత విభాగం అధ్యక్షుడు మునగాల మల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలతో జీవితాలు చిత్తు



నగరంపాలెం: మాదక ద్రవ్యాలు, గంజాయి వంటి మత్తు పదార్థాలతో జీవితాలు దుర్భరంగా మారతాయని సెబ్ గుంటూరు సూపరింటెండెంట్ ఎస్.అన్నపూర్ణ చెప్పారు. ప్రపంచ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవంలో భాగంగా గురువారం ఎస్ఈబీ (సెబ్) గుంటూరు–2 స్టేషన్ ఆధ్వర్యంలో నల్లచెరువు మహావీర్ కళాశాలలో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గంజాయి తాగినా, పట్టుబడినా చదువుకు ఆటంకం ఏర్పడుతుందని, తద్వారా ఉద్యోగావకాశాలు ఉండవని చెప్పారు. స్థానికంగా ఎవరైనా గంజాయి విక్రయిస్తే సమాచారాన్ని టోల్‌ఫ్రీ నంబర్ 14500కు తెలియజేయాలని కోరారు. సమాచారం చెప్పిన వారి వివరాల్ని గోప్యంగా ఉంచుతామని తెలిపారు. కార్యక్రమంలో ఏఎస్ కె.మణికంఠ, సెబ్–1 సీఐ ఎం.రమేష్, కళాశాల ప్రిన్సిపాల్, విద్యార్థులు పాల్గొన్నారు.

కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో వసతులు,బోధన

సమగ్ర శిక్ష ఏపీసీ విజయలక్ష్మి

గుంటూరు రూరల్: ప్రభుత్వ పాఠశాలల్ని కార్పొరేట్‌కు దీటుగా అన్ని వసతులతో ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి అభివృద్ధి చేశారని సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్ట్ కో–ఆర్డినేటర్ (ఏపీసీ) విజయలక్ష్మి తెలిపారు. మండలంలోని నల్లపాడులో గల ప్రభుత్వ పాఠశాల్లో గురువారం మధ్యాహ్న భోజనం, పాఠశాల నిర్వహణ, పారిశుద్ధ్యం తదితరాల్ని పరిశీలించారు. ముందుగా గ్రామంలోని ఎస్సీ కాలనీ ప్రభుత్వ పాఠశాలను ఆకస్మిక తనిఖీ చేశారు. పరిశుభ్రత సక్రమంగా లేకపోవడం, నిర్వహణ బాధ్యతగా తీసుకోకపోవడంతో ఉపాధ్యాయులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఎంతో నిబద్ధతతో ప్రతి విద్యార్థికి విద్యను అందించేందుకు అనేక సంక్షేమ పథకాల్ని అమలు చేస్తోందని తెలిపారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తీసుకుంటామని చెప్పారు. అనంతరం నల్లపాడులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను తనిఖీ చేశారు. విద్యార్థులతో కలసి భోజనం చేశారు. ఆర్వో ప్లాంటు, వంటశాల, విద్యార్థుల బాత్‌రూంలు పరిశీలించారు. పాఠశాల నిర్వహణ, మధ్యాహ్న భోజనంపై సంతృప్తి వ్యక్తం చేశారు. హెచ్ఎం విజయలక్ష్మి, ఉపాధ్యాయుల్ని అభినందించారు. నాడు– నేడు కార్యక్రమంలో పాఠశాలలో అభివృద్ధిని పరిశీలించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు మెట్టు వెంకటప్పారెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రకటన

... M/s. Shriram Finance Ltd. ...

రాయపూడి శ్రీనివాసరావు
అడ్వకేట్ & నోటరీ, సెల్: 98484 12820
Enrolment Number: 1370/1987
తేది.22-06-2023

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
99122 25447 (మంగళగిరి)
90100 67114 (తాడికొండ)
Office mail : sakshigntadvt@gmail.com